డ్వాక్రా భవన నిర్మాణ పనుల పరిశీలన


7వ వార్డులో డ్వాక్రా భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి.

ఘట్‌కేసర్,డిసెంబర్23: పోచారం మున్సిపాలిటీ 7వ వార్డులో నిర్మిస్తున్న డ్వాక్రా భవనాన్ని చైర్మన్ కొండల్‌రెడ్డి సోమవారం పరిశీలించారు.మున్సిపాలిటీ నిధులు రూ.15లక్షలతో నిర్మిస్తున్న ఈ భవనం పనులు ఎంత వరకు జరిగాయి,ఎప్పటి వరకు పూర్తి అవుతాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుక రావాలని సూచించారు. పలువురు లబ్ధిదారులకు మున్సిపాలిటీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను చైర్మన్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్ తదితరులు అందజేశారు.

డక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్‌లో క్రిస్మస్

రంగురంగుల డ్రెస్‌లతో విద్యార్థులు

రామంతాపూర్,డిసెంబర్ 23: నాచారం రాఘవేంద్రనగర్‌లో డక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ లోసోమవారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి.విద్యార్థులు ఆట పాటలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల చైర్మన్ కె. నవనీత్ రావు,మేనేజింగ్ డైరెక్టర్ నవీన్‌కుమార్, ప్రిన్సిపాల్ సుమామీనన్, విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

కీసర, డిసెంబర్ 23: రాంపల్లిదాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో 'సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన' కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఆర్గానిక్ గార్డెన్‌లో ప్రకృతి సేద్యంతో పండించిన వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన కేంద్రాన్ని విద్యార్థుల తల్లిదండ్రుల కోసం ఏర్పాటు చేశారు. రైతులు పడుతున్న కష్టాలు, వారి పండించిన పంటలను నేరుగా విద్యార్థులు చూడ టం ద్వారా విద్యార్థుల్లో మరింత పరిజ్ఞానం పెరుగుతుందన్న నేపథ్యంలో ఈ ప్రదర్శన నిర్వహించామని ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మజారావు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులుతల్లిదండ్రులుపాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను నిర్వహిస్తున్న విద్యార్థులు

ముస్లింలకు అండగా ఉంటా

మల్లాపూర్: మసీదు నూతన భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మసీదు ఏ అలీ అబు తాలిబ్ నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే బండారి శంకుస్థాపన

మల్లాపూర్, డిసెంబర్ 23: ముస్లింలు ఎలాంటి అవసరాలున్నా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ న్యూ నర్సింహనగర్ కాలనీలోని మసీదు ఏ అలీ అబు తాలిబ్ నూతన భవనం ఏర్పాటుకు ఆయన కార్పొరేటర్ జె. ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ జి. శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సాయిజన్ శేఖర్, గంధం నాగేశ్వర్‌రావు, ముస్లింలు వాషింగ్ ఖాన్ ఇమామ్, ముస్తాఫా మజాయిన్, హనీఫ్, ఎండీ. రిజ్వాన్, జావిద్, ముజాహిద్ నవాజ్, కబీర్ భాయి, సయ్యద్ సబేర్, అబ్దుల్ వహీద్, నిసార్ అహ్మద్ గోరి, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పలువురు

మల్లాపూర్: మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ కృష్ణానగర్ కాలనీ నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం నాయకులు సోమవారం కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంక్షేమ సంఘం నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మల్లారెడ్డి, మాజీ అధ్యక్షుడు సుఖేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం.ఎస్ ఎన్ మూర్తి, జె. రాజయ్య, జయమ్మ, ప్రధాన కార్యదర్శి దేవరాజ్, కోశాధికారి అంజయ్య, జాయింట్ సెక్రటరి బాలరాజ్‌గౌడ్, డి. శ్రీనివాస్, శ్యామ్‌సుందర్, కృష్ణవేణి, ఈసీ మెంబర్లు చారి, శ్రీకాంత్‌రెడ్డి, సుజాత, శ్రీనివాస్, కృష్ణారెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కాప్రా: తెలంగాణ రైతు సేవా సంక్షేమసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితుడైన కాప్రాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు మచ్చపాండుగౌడ్ సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని ఏఎస్‌రావునగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పాండుగౌడ్‌ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌బీ కాలనీ డివిజన్ కార్పొరేటర్ జే.ప్రభుదాస్, కనకయ్య, జైని రాజేశ్వర్‌గుప్తా పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

కమిషనర్ ఇలంబర్తికి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్

నేరేడ్‌మెట్, డిసెంబర్ 23 : నియోజకవర్గ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేర కు గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఉత్తమ్‌నగర్, మల్లికార్జున నగర్ గౌతమ్‌నగర్ తదితర కాలనీలోని అభివృద్ధి పనుల కోసం నిధులను మంజూరు చేయాలని కోరుతూ సోమవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని గౌతమ్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతా రాముయాదవ్ సోమవారంమర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ రాజును ప్రజావాణిలో కలిసి డివిజన్ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే పూర్తి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాముయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్ 23: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా అద నపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నా రు. కలెక్టరేట్ సోమవారం నిర్వహిం చిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై 94 ఫిర్యాదులను అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఇన్ చార్జి డీఆర్‌ఓ శంకర్ కుమార్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ పనులు పరిశీలన

తూంకుంటలో భూ సేకరణ వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి.

శామీర్‌పేట, డిసెంబర్ 23: ఎలివేటెడ్ కారిడార్ రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి కోరారు. రోడ్డు విస్తరణకు కొనసాగుతున్న భూ సేకరణ పనులను సోమవారం డీఆర్‌వో శంకర్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ సేకరణ ప్రక్రియలో భాగంగా స్థల సేకరణ మార్కింగ్‌లను పరిశీలించామన్నారు. అల్వాల్, తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో ఈ ప్రాజెక్టు క్రింద నిర్మాణాలు కోల్పోతున్న వారి ఇంటి దస్తావేజులు, రేషన్ కార్డులు, ఆధార్, ఓటర్ ఐడీ కార్డులను పరిశీలించి రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం భూ సేకరణకు సంబంధిత వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు యాదగిరిరెడ్డి, రఘు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలి

అంతర్జాతీయ రైతు దినోత్సవంలో మాట్లాడుతున్న అధికారులు.

శామీర్‌పేట,డిసెంబర్23: ప్రభుత్వ స్కీములు, ఆర్థిక సైబర్ మోసాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీడ్ బ్యాంక్ అధికారులు లక్ష్మీకాంత్‌రెడ్డి, సతీష్ అన్నారు. బొమ్మరాశిపేటలో కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ రైతు దినోత్సవం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ శామీర్‌పేట బ్రాంచ్ మేనేజర్ సాగర్, ఏఈవో రవియాదవ్, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు జ్యోతి, శ్రీకాంత్, సౌందర్య, రైతులు ఉన్నారు.

నగరాలను సాంకేతికంగా అభివృద్ధి చేయాలి

మేడ్చల్, డిసెంబరు 23: నగరాలను సాంకేతికంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఎన్ఐటీటీ ప్రొఫెసర్ సతీష్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ గౌడవెల్లి పరిధిలో ఉన్న హైదరాబాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(హితం) కళాశాలలో ఆరు రోజులుగా పునరుజ్జీవ నగరాలు అనే అంశంపై జరుగుతున్న సదస్సు సోమవారం ముగిసింది. కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరవింద్, కో ఆర్డినేటర్ టీఆర్ గుప్తా, అధ్యాపకులు పాల్గొన్నారు.


నిట్ ప్రొఫెసర్ సతీష్‌ను జ్ఞాపికతో సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ అరవింద్

నేడు పాస్టర్లకు దుస్తుల పంపిణీ

కాప్రా, డిసెంబర్ 23: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని బీఎల్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఏఎస్‌రావునగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా పాస్టర్లకు దుస్తుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల పాస్టర్లు ఆధార్ కార్డు తీసుకొని రావాలని ప్రకటనలో కోరారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కాప్రా: జీహెచ్ఎంసీ ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఉప్పల్ సర్కిల్‌కు చెందిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ ఉంటుందని, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా చెక్కుల పంపిణీ జరుగుతుందని, లబ్దిదారులు, వారికి సంబంధించిన వారు హాజరు కావాలని ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి

మేడ్చల్, డిసెంబరు 23 : సమాజంలో, సామాజిక మాధ్యమాల వినియోగంలో విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని షీ టీం ఏఎస్ఐ సాయిలు సూచించారు. మేడ్చల్ పట్టణంలోని న్యూ లిటిల్ లిల్లీ హైస్కూల్‌లో సోమవారం షీం టీం ఆధ్వర్యంలో ఈవ్ టీజింగ్, సామాజిక మాధ్యమాల వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ గంగారం, కానిస్టేబుళ్లు కవిత, ఇఫ్తార్, నూరోద్దీన్, విద్యార్థులు, టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీంటీం అధికారి

రైతులకు సన్మానం

మేడ్చల్: జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మేడిపల్లి శ్రీ చైతన్య పాఠశాలలో పలువురు రైతులను సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన నారాయణగూడ జోన్ ఏజీఎం అలీ రైతుల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దయాకర్‌రావు, కోఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ మాలతి, డీన్ మధుకర్‌రెడ్డి, సీ–బ్యాచ్ ఇన్‌చార్జి వెంకన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

కీసరలో ఆధార్ కేంద్రం లేక ప్రజల ఇక్కట్లు

కీసర, డిసెంబర్ 23: కీసరలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని కీసర బీజేపీ నేత నల్లా వెంకట్‌రెడ్డి మండల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కీసరలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో ప్రజలంతా నాగారం వైపు వెళుతున్నారని అన్నారు. ఈ విషయంలో తహసీల్దార్ స్పందించి కీసరలో వెంటనే ఆధార్ సెంటర్ ఏర్పాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు అందజేసిన వినతిప్రతంలో పేర్కొన్నారు.

సంస్కృతి టౌన్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హరిప్రసాద్ ఎన్నిక

ఘట్‌కేసర్,డిసెంబర్23: పోచారం మున్సిపాలిటీ 12 వార్డులోని సంస్కృతి టౌన్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షుడుగా నాలుగోసారి బి.హరి ప్రసాద్ రావు ఎన్నికయ్యారు.అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 22న నిర్వహించారు. ఎన్నికల ప్రతినిధులు సృతి,రఫీ,సాయికుమార్‌లు, పోలీసులు,కాలనీ వాసులు సమక్షంలో గెలుపొందిన అభ్యర్థుల పేర్లను ప్రకటించి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.అధ్యక్షుడుగా ఎన్నికైన హరి ప్రసాద్‌రావు ప్రస్తుతం 12 వార్డు కౌన్సిలర్‌గా కొనసాగుతున్నారు. ఉపాధ్యక్షుడుగా పీవీఎన్. తస్యానారాయణ,సెక్రెటరి పిఎన్.ఇందిరా ప్రియదర్శిని,ట్రెజరర్ శశిధర్‌లాల్,సభ్యులుగా పి.వి.సరిత,కె.ప్రగతి,జిఎస్.ప్రతిభ,బిదూషి పాత్రో,దీపక్ నాయర్,అనీల్‌రెడ్డి,భానుప్రసాద్,రోహిత్ రావు ఎన్నికైయ్యారు.

ఉన్నతి కేంద్రం ప్రారంభం

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 23: విద్యార్థులకు నూతన సాంకేతిక రంగాల్లో నైపుణ్యాలను అందించి వారికి ఉద్యోగ అవకాశాలు పెంపొందించటమే లక్ష్యంగా కోడ్ ఉన్నతి కేంద్రం పని చేస్తుందని టాస్క్ ప్రోగ్రామ్ మేనేజర్ ప్రదీప్ రెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్ లోని సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్‌లో ఎస్ఏపీ ల్యాబ్స్ ఇండియా, ఎడ్యూనెట్ ఫౌండేషన్, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సంస్థల సీఎస్ఆర్ ప్రాజెక్ట్ కింద ఏర్పాటు చేసి ఉన్నతి కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎడ్యూనెట్ ప్రోగ్రామ్ మేనేజర్ మహమ్మద్ ఫాషా, టాస్క్ రిలేషన్‌షిప్ మేనేజర్ నరేష్, సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమాకాంత్‌రెడ్డి, వివిధ విభాగాల ప్రిన్సిపాల్ లు జానకిరాములు, శివ కేశవరెడ్డి, అరుణ్ రెడ్డి, నీలం సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

మేడ్చల్, డిసెంబరు 23 : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రారంభించిన సందర్భంగా కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత, డైరెక్టర్ డాక్టర్ సరోజారెడ్డి, ఏడీ అనురాగ్ రెడ్డి, పీఆర్వో రవి సుధాకర్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

ఘట్‌కేసర్ ఎంపీడీవో కార్యాలయంలో భూ బాధితులతో మాట్లాడుతున్న కీసర ఆర్డీవో సైదులు

భూబాధితలతో ఆర్డీవో సమావేశం

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 23: ఘట్‌కేసర్ పట్టణంలో నిర్మించే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కీసర ఆర్డీవో సైదులు కోరారు. ఘట్‌కేసర్ పట్టణంలోని మండల పరిషత్ సమావేశం కార్యాలయంలో బ్రిడ్జి నిర్మాణంలో స్థలాలు కోల్పోతున్న బాధితులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆర్డీవో తోపాటు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్య యాదవ్, బీబ్లాక్ అధ్యక్షుడు మహేష్ గౌడ్ సమావేశంలో పాల్గొన్నారు. ఆర్డీవో సైదులు మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోతున్న బాధితులకు ఇవ్వాల్సిన నష్టపరిహారాన్ని గతంలోనే కోర్టులో డిపాజిట్ చేసినందున ఆ డబ్బులను బాధితులు తీసుకుని సహకరించాలన్నారు. గతంలో ఇచ్చిన నష్టపరిహారం తక్కువని బావిస్తే చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని చెప్పారు. వజ్రేష్ యాదవ్, సుధీర్‌రెడ్డి మాట్లాడుత ఎక్కువ నష్టపోయిన అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, లేదా 60గజాల ఇంటి స్థలాన్ని మంజూరు చేసేలా సహకరిస్తామని చెప్పారు. బ్రిడ్జి నిర్మాణం ఆగిపోవటం ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. స్వచ్చందంగా నిర్మాణాలను తొలగించుకున్న బాధితులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు.బాధితుల డిమాండ్ల పరిష్కారమే లక్ష్యం పని చేస్తామని హామీ ఇచ్చారు.

వ్యాపారాలు కోల్పోయి రోడ్డున పడ్డాం

బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా వాణిజ్య సంస్థలను తొలగించటం వల్ల ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని బాధితులు ఆరోపించారు. 2012 నోటిఫికేషన్ ద్వారా అతి తక్కువ డబ్బులు మంజూరు ఇచ్చారన్నారు. దీంతో తమకు తీవ్ర నష్టం కలుగుతుందని బాధితులు ఆరోపించారు.2013 నోటిఫికేషన్ జారీ చేసి మూడు రేట్లు నష్టపరిహారం అందించాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్, జేఏసీ కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి, భూ బాధితులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాజకీయ జోక్యం

- క్రీడాకారుల ఎంపికలో జిల్లాకు అన్యాయం
- ఖోఖోలో ద్వితీయ స్థానం తోసిరాజీ
- తృతీయ స్థానం నుంచి ముగ్గురి ఎంపిక

మైదానంలో సాధన చేస్తున్న విద్యార్థులు

మేడ్చల్, డిసెంబరు 23 : క్రీడల్లో రాజకీయ జోక్యం, ఆశ్రిత పక్షపాతం కారణంగా అర్హత ఉన్న క్రీడాకారులకు అన్యాయం జరుగుతుంది. ఆర్థిక, రాజకీయ ప్రాబల్యం ఉన్న వ్యక్తులు ఎంపిక కమిటీల్లో చేరి తమకు అనుకూలమైన వారికి ఎంపిక చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఈ కారణంగానే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఎస్‌జీఎఫ్ ఖోఖోలో అన్యాయం జరిగిందని క్రీడాకారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

అండర్ 14 బాలుర విభాగంలో...

జిల్లాలను పరిపాలన సౌలభ్యం కోసం గత ప్రభుత్వ హయాంలో 22జిల్లాలుగా విభజించినా క్రీడలను మాత్రం 10 ఉమ్మడి జిల్లాల పరిధిలోనే నిర్వహిస్తున్నారు. ఖోఖో 14 ఏండ్లలోపు బాలుర విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపికకు గత నెలలో దోమలగూడలోని జీసీపీఈ(గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యూకేషన్)లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి 10 జిల్లాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో మొదటి స్థానంలో ఆదిలాబాద్ జట్టు నిలువగా, రంగారెడ్డి రెండో స్థానంలో, తృతీయ స్థానంలో వరంగల్, నాలుగో స్థానంలో మెదక్ నిలిచింది. సాధారణంగా మొదటి స్థానంలో నిలిచిన జట్టు నుంచి ముగ్గురు విద్యార్థులను, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టు నుంచి ముగ్గురిని, తృతీయ స్థానంలో నిలిచిన జట్టు నుంచి ఇద్దరిని, నాలుగో స్థానంలో నిలిచిన జట్టు నుంచి ఒకరిని తీసుకుంటారు. కానీ సెలెక్టర్లు, అబ్జర్వలు నిబంధనలను తోసిరాజీ ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టు నుంచి ముగ్గురిని తీసుకోవాల్సి ఉండగా ఇద్దరిని మాత్రమే తీసుకున్నారు. తృతీయ స్థానంలో నిలిచిన వరంగల్ జట్టు నుంచి ముగ్గురిని తీసుకున్నారు. అంతకు ముందు జరిగిన ఖోఖో అండర్ 17 బాలికల, బాలుర, అండర్ 14 బాలికల విభాగాల్లో క్రీడాకారుల ఎంపికలో మాత్రం నిబంధన పాటించారు.

న్యాయం చేయాలి

రంగారెడ్డి జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచినప్పటికీ ఇద్దరిని మాత్రమే ఎలా తీసుకుంటారని విద్యార్థులు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. నిబంధనల ప్రకారం వ్యవహరించకుండా రాజకీయం చేయటం తగదని అంటున్నారు. జాతీయ స్థాయిలో ఆడేందుకు విద్యార్థులు ఎంతో ఉత్సుకతో ఉంటే వారి ఆశలపై నీళ్లు చల్లారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం చదువుతో పాటు క్రీడా సాధన చేస్తూ భవిష్యత్‌లో జాతీయ స్థాయిలో రాణించే కలలుగనే చిన్నారులకు అన్యాయంపై సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు. విచారణ జరిపి, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, జిల్లా క్రీడాకారులకు న్యాయంచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

జవహర్‌నగర్,డిసెంబర్23: జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేద్కర్‌నగర్ చాకలి ఐలమ్మకాలనీలో జిల్లా అధ్యక్షుడు శాగంటి వెంకటేష్ ఆధ్వర్యంలో జనగామ పట్టణంలో ఈనెల29న నిర్వహించనున్న రజక రిజర్వేషన్ సమితి మహాసభల వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో గోపి, లక్ష్మణ్, సాంబ రాజ్‌కుమార్, క్రాంతి కుమార్, బాలరాజు, సత్తయ్య, కవిత, దివ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

నేరేడ్‌మెట్, డిసెంబర్ 23: వినాయకనగర్ డివిజన్ పరిధిలోని వివిధ అభివృద్ధి పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పరిశీలించారు. జేకే కాలనీలోని బాక్స్ డ్రైయిన్ పనులను కాలనీవాసులు, సంబంధిత అధికారులు ఏఈ సత్యలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, సాగర్ తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నేరేడ్‌మెట్, డిసెంబర్ 23 : విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం మల్కాజిగిరి నియోజకవర్గంలో 11కేవీ ఎన్ఎండిసి కల్యాణ్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు కల్యాణ్‌నగర్, ఎన్ఎండీసీ కాలనీ, ఆనంద్‌బాగ్ ఈస్ట్, బ్యాంకుకాలనీ, తాళ్లబస్తీలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. 11కేవీ ఏఎస్ఎన్ నగర్ ఫీడర్ ఉదయం 11 నుంచి 11:30 వరకు అనంత సరస్వతీనగర్, స్ట్రీట్ నంబర్ 1,2, 3 షిర్డీనగర్, ఆదర్శనగర్‌లో విద్యుత్ అంతరాయం ఉంటుంది. 11కేవీ ఈస్ట్ చంద్రగిరి కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు లాల్‌వాణినగర్, చంద్రగిరికాలనీ, వినాయకనగర్ తదితరు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వెల్లడించారు.

రామంతాపూర్: సరస్వతీనగర్ ఫీడర్ పరిధిలోని సరస్వతీ నగర్,ఆర్టీఏ ఆఫీస్‌లైన్ ఎస్‌వీఎం హోటల్‌లైన్ నాగోల్ మెట్రో స్టేషన్‌లో ఉదయం 10 .30 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు అదే విధంగా,ఉప్పల్ శిల్పారామం ఫీడర్ పరిధిలో ఉప్పల్ శిల్పారామం,డీమార్టులైన్ ,వాసవీ కనస్ట్రక్షన్స్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 1.30 నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరానిలిపివేస్తున్నట్లు ఏఈ బి. కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

మేడ్చల్ కలెక్టరేట్: రాంపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 11 కేవీ ఆర్టీసీ కాలనీ ఫీడర్,11 కేవీ రామాలయ ఫీడర్, 11 కేవీ శ్రీనగర్ ఫీడర్, 11 కేవీ ఆర్ఎల్ నగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఏఈ ఎస్.మురళీకృష్ణ కోరారు.

బోడుప్పల్: బోడుప్పల్ పరిధిలోని ఉదయం 10:30నుంచి మధ్యాహ్నం 2:30వరకు మణికంఠనగర్, వివేకానందనగర్, లెక్చరర్స్ కాలనీ, ఐఐసీటీ కాలనీ, ఎన్ఐఎన్‌కాలనీ, భీంరెడ్డినగర్ కాలనీ, గ్రీన్‌సిటీకాలనీ, అనఘాపురి కాలనీలో విద్యుత్ అంతరాయం ఉంటుదని ఏఈ ఎన్.వేణుగోపాల్ తెలిపారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

రామంతాపూర్,డిసెంబర్ 23: ఉప్పల్ భగాయత్‌లో స్వయంభూ శ్రీ కాలభైరవ బ్రహ్మోత్సవాలు సోమవారం రెండో రోజు ఘనంగా సాగాయి. శివ పార్వతుల కల్యాణం తదితర కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. మాజీ హెచ్ఎండీఏ కమిషనర్ చిరంజీవి,ఉప్పల్ తహసీల్దార్ వాణీరెడ్డి, రైతు సంఘం నాయకులు మేకల శివారెడ్డి, మేకల మధుసూదన్‌రెడ్డి,సల్ల రాజిరెడ్డి,గోనె అర్జున్‌రెడ్డి,బంగ్లా శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, శ్రీహరి,వినయ్‌సాగర్,నరేంద్రచౌదరి,కమ్మ లక్ష్మణ్,సంతోస్,ఉపేందర్,వినోద్‌రెడ్డి,నర్సింహరెడ్డి,జితేందర్‌రెడ్డి,లన్య బాలకృష్ణ,రమాకాంత్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

బోడుప్పల్, డిసెంబర్23: అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలుంటాయని బోడుప్పల్ రెవెన్యూ, మున్సిపల్‌అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు నగరపరిధి సర్వేనంబర్–63లోని ప్రభు త్వ స్థలంలో,13వ డివిజన్ దేవేందర్‌నగర్ కాలనీ, 14డివిజన్ కాలనీలో నిర్మిస్తున్న అక్రమనిర్మాణాలను సోమవారం జేసీబీతో అధికారులు తొలగించారు. నిర్మా ణ అనుమతులు తీసుకుని ఇండ్ల నిర్మాణం చేపట్టాలని లేకుంటే కూల్చివేతలు తప్పవని హెచ్చరించారు.

అధికారుల చర్యల పట్ల స్థానికులు అవాక్కు

దొంగలు పడ్డాక ఆరునెలలకు కుక్కలు మొరిగాయన్న చందంగా ఉంది బోడుప్పల్ మున్సిపల్, రెవెన్యూ అధికారుల చర్యలు. మున్సిపల్ ఆదాయానికి గండికొడుతూ.. నిత్యం పదుల సంఖ్యలో ప్రభుత్వ భూమిలో అక్రమనిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదులొస్తున్న పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, కమిషనర్ పట్టించుకున్న పాపాన పోవడంలేదని స్థానికులు బాహటంగానే ఆరోపిస్తున్నారు. అందినకాడికి దండుకుని...అవునా... అక్రమనిర్మాణాలు జరుగుతున్నాయా... అయితే నోటీసులిస్తామని, ఇప్పటికే కొన్నింటికి నోటీసులిచ్చి చేతుతు దులుపుకుంటున్నా రు అధికారులు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు అమ్యామ్యాలు ముడితే అక్రమనిర్మాణాల వైపు అసలు కన్నెత్తి చూడరని ఇటీవల ఓ కాంగ్రెస్ కార్పొరేటర్ పేర్కొనడం గమనార్హం. అక్రమనిర్మాణాలను అధికారులు, కొంతమంది స్థానిక నాయకులు ప్రోత్సహి స్తూ భారీగా సొమ్ముచేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

తేది: 23-12-2024

బహిరంగ ప్రకటన

LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, తార్నాక బ్రాంచి శ్రీ జయరాం సిర్వే తండ్రి స్వర్గీయ పున్న రాంజి సిర్వి యొక్క ఫైల్ నెం. 7001060002341ను లీగల్ ఒపీనియన్ కొరకు నాకు అప్పగించినదని ఇందుమూలంగా సాధారణ ప్రజలకు తెలియజేస్తున్నాను. దాఖలు చేసిన డాక్యుమెంట్లలో లింక్ డాక్యుమెంట్ల సర్టిఫైడ్ కాపీ అనగా SRO ఉప్పల్ పరిధిలో బ్లాక్ నెం.13, సూర్యానగర్, మల్లాపూర్ గ్రామం, ఉప్పల్ మండలం, కాప్రా మున్సిపాలిటి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా (గతంలో రంగారెడ్డి జిల్లా) వద్ద గల 100 చ.గజాలు లేదా 83.6 చ. మీటర్ల విస్తీర్ణం, ప్లాట్ నం. 31/పార్ట్ యావత్తు (సరిహద్దులు: ఉత్తరం: 25' వెడల్పు రోడ్, దక్షిణం: ప్లాట్ నం. 31/పార్ట్, తూర్పు: ప్లాట్ నం. 31/పార్ట్, పడమర: ప్లాట్ నం. 31/పార్ట్) కు సంబంధించి శ్రీ యు.శ్రీనివాసులు పేరున ఆమె జిపిఎ హోల్డర్ కె.గోపాల రావు ద్వారా ప్రాతినిధ్యం వహించబడు శ్రీమతి జి.ఝాన్సీ లక్ష్మీ బాయి ద్వారా ఎగ్జిక్యూట్ చేసిన నెం. 3651/2005, తేది: 20-04-2005 కలిగిన సేల్ డీడ్ ఉన్నది. విచారణ సమయంలో ఒరిజినల్ పోయినదని తెలియజేశారు.

డాక్యుమెంట్ల అక్రమ స్వాధీనంలోగల వ్యక్తి/వ్యక్తులతో వ్యవహరించరాదని ఇందుమూలంగా సాధారణ ప్రజలను హెచ్చరించడమైనది. పోయిన డాక్యుమెంట్ ఆధారంగా పైన తెలిపిన ఆస్తికి సంబంధించి ఎవరైనా వ్యక్తి/వ్యక్తులు ఏవైనా వ్యవహారాలు కుదుర్చుకుంటే వారి స్వంత నష్టపూచీపై చేసినట్లవుతుంది మరియు అటువంటి వ్యవహారాలు పరిగణించబడవు.

పై డాక్యుమెంట్ ఎవరికైనా దొరికితే ఈ నోటీసు ప్రచురణ నుండి 15 రోజులలోగా దిగువ చిరునామాలో వాటిని అందజేయాలి.

సదరు ఆస్తిపై ఎవరికైనా ఏదేని క్లెయిమ్/ప్రయోజనం/వివాదం ఉన్నట్లయితే నోటీసు ప్రచురణ నుండి 15 రోజులలోగా దిగువ సంతకందారుకు తెలియజేయాలి. లేనిచో సదరు ఆస్తిపై తదుపరి క్లెయిమ్ అనుమతించబడదు.

సం/– T.N. హరిప్రియ, అడ్వకేట్
కౌన్సెల్ ఫర్ LICHFL HYA 0006
ఇం.నెం. 2-17-76/2/46, రాఘవేంద్రనగర్ కాలనీ, సర్వే ఆఫ్ ఇండియా ఎదుట, ఉప్పల్ రోడ్, హైదరాబాద్-500 039, ఫోన్: 9848219788.